

జ్యోతి ప్రజ్వలన చేసి వాల్యూజోన్‌ను ప్రారంభిస్తున్న ప్రముఖ సినీనటుడు నందమూరి బాలకృష్ణ



సినీ నటుడు బాలకృష్ణను చూసేందుకు పెద్దసంఖ్యలో తరలివచ్చిన అభిమానులు

# పటాన్‌చెరులో వాల్యూజోన్ హైపర్ మార్ట్

- ప్రారంభించిన సినీనటుడు నందమూరి బాలకృష్ణ
- కొత్త థీమ్‌తో తప్పక సక్సెస్
- హైదరాబాద్‌లోనే మొదటి అతిపెద్ద ఔట్‌లెట్ మాల్
- జనంతో కిటకిటలాడిన వాల్యూజోన్

పటాన్‌చెరు, డిసెంబర్ 15 : పటాన్‌చెరులో వాల్యూజోన్ హైపర్ మార్ట్‌ను ప్రముఖ సినీనటుడు నందమూరి బాలకృష్ణ ప్రారంభించారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో అతిపెద్ద ఔట్‌లెట్ మాల్ వాల్యూజోన్‌ను సంస్థ ప్రముఖులు వెంకటేశ్వర్లు, రాజమౌళి, ప్రసాదరావులతో కలిసి ఆయన ప్రారంభించగా, బాలకృష్ణను చూసేందుకు అభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్థ యాజమాన్యంతో తనకు చాలా స్నేహం ఉందన్నారు. ఈ వాల్యూజోన్ హైపర్ మార్ట్ రిటైల్ వాణిజ్య వ్యవస్థలోనే ఒక వినూత్న విప్లవమన్నారు. హైదరాబాద్‌లోనే అతి పెద్ద మార్ట్ వాల్యూజోన్ అని కొనియాడారు. తనను వాల్యూజోన్ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం సంతోషాన్ని కలిగిస్తున్నదన్నారు. సరికొత్త వ్యాపార ఆలోచనతో యాజమాన్యం ముందుకు వచ్చిందని, తప్పకుండా ప్రజలు ఆదరిస్తారని తనకు నమ్మకం ఉందన్నారు. ఫ్యాషన్, ఫుడ్, ఫన్ ఒకేచోట ఉండడంతో ప్రజలు ఆహ్లాదరకరమైన షాపింగ్ అనుభూతిని పొందుతారన్నారు. కొత్త రకమైన ఆలోచనలకు ఎప్పుడూ ఆదరణ ఉంటుందన్నారు. పూర్వకాలంలో తన తండ్రి ఎన్టీఆర్ కూడా కొత్త ఆలోచనలతో ముందుకుపోవడంతోనే చరిత్ర సృష్టించారన్నారు. అన్ని రకాలైన వస్తువులు ఒకేచోట లభ్యం కావడంతో డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. వాల్యూజోన్ హైపర్ మార్ట్ సక్సెస్ కావాలని ఆయన ఆకాంక్షించారు.

### నాణ్యతకు పెద్దపీట : యాజమాన్యం

హైదరాబాద్‌లోనే మొట్టమొదటి అతిపెద్ద ఔట్‌లెట్ మాల్ వాల్యూజోన్ అని ఆ సంస్థ ప్రతినిధులు వెంకటేశ్వర్లు, రాజమౌళి, ప్రసాదరావు తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో వాల్యూజోన్ రాక కొత్త రకమైన వ్యాపారానికి నాంది పలికినట్లుగా వారు పేర్కొన్నారు. నాణ్యతకు పెద్దపీట వేస్తామని తెలిపారు. విలువలను పాటిస్తూ వ్యాపారం నిర్వహిస్తామన్నారు. ప్రజలు చెల్లించే ప్రతి రూపాయికీ తగిన విలువను అందజేస్తామన్నారు. గ్లోబల్ బ్రాండ్స్, ఇండియన్ ఫ్యాషన్ బ్రాండ్స్ మొదలుకుని గ్రాసరీస్, ఫుట్‌వేర్, లగేజ్, ఫర్నిషింగ్స్, స్టేషనరీ, మొబైల్ యాక్సరీస్‌లు ఒకేచోట లభిస్తున్నాయన్నారు. 2లక్షల వైవిధ్యభరితమైన ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఏడాది పొడవునా అనేక ఆఫర్లతో వినియోగదారులకు లభించేలా చేస్తున్నామన్నారు. పటాన్‌చెరులో ఈ వాల్యూజోన్ హైపర్ మార్ట్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.

జాతీయ రహదారి, రింగ్‌రోడ్డుకు కూతవేటు దూరంలో తమ ఔట్‌లెట్ ఏర్పాటు చేశామన్నారు. విశాలమైన పార్కింగ్, పిల్లలకు ఆటలాడేందుకు ఫన్ జోన్, భోజన ప్రియులకు ఫుడ్ జోన్లు కూడా ఉన్నాయన్నారు. నందమూరి బాలకృష్ణ తమ సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండడం ఆనందంగా ఉందని తెలిపారు.



రౌడీమేళాలో మాట్లాడుతున్న సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేశ్

# పుట్టుకతో ఎవరూ నేరస్తులు కారు..

- సంఘవిద్రోహ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు
- సత్ప్రవర్తనతో ఉంటే హిస్టరీ షీట్లను తొలగిస్తాం
- రౌడీ మేళాలో సంగారెడ్డి ఎస్పీ రూపేశ్

సంగారెడ్డి, డిసెంబర్ 15 : పుట్టుకతో ఎవరూ నేరస్తులు కారని, పరిస్థితులను బట్టి క్షణికావేశంలో నేరాలు చేస్తారని ఎస్పీ చెన్నూరి రూపేశ్ అన్నారు. శుక్రవారం పోలీస్ కల్యాణ మండపంలో రౌడీమేళా కార్యక్రమంలో భాగంగా సత్ప్రవర్తన కలిగి ఉండాలని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రత పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. చట్టానికి లోబడి ఉన్నవారితో ఫ్రెండ్లీగా ఉంటామని, చట్టాన్ని అతిక్రమిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. సంఘవిద్రోహ చర్యలకు పాల్పడిన, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టిన చర్యలు తప్పవన్నారు. సత్ప్రవర్తనతో కలిగి ఉన్న రౌడీషీటర్లపై హిస్టరీ షీట్లను తొలగిస్తామన్నారు. జిల్లా ప్రజలు సంఘవిద్రోహ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అశోక్, సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్ డీఎస్పీలు రమేశ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, రఘు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శివలింగం, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్

**మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి**



బాధిత కుటుంబానికి బీమా చెక్కును అందజేస్తున్న మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట, డిసెంబర్ 15: పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. చిన్నశంకరంపేటకు చెందిన డప్పు నర్సింహులు ఇటీవల మృతిచెందాడు. మృతుడికి పార్టీ సభ్యత్వం ద్వారా మంజూరైన రూ.2లక్షల చెక్కును భార్య శోభకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నర్సింహులు మృతి పార్టీకి తీరని లోటన్నారు. చనిపోయిన కార్యకర్త కుటుంబానికి పార్టీ ఇన్సూరెన్స్ చెక్కు కొండంత భరోసా ఇస్తున్నదన్నారు. ప్రతి కార్యకర్తనూ కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజు, పట్టణ అధ్యక్షులు హేమ, చంద్రం వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీ యాదగిరి, సర్పంచులు, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, దయానంద్ యాదవ్, నాయకులు కుమార్‌గౌడ్, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ ప్రభాకర్, స్వామి, శ్రీనివాస్, నరేశ్, వెంకటేశం, లక్ష్మణ్, చిలుక నాగరాజు పాల్గొన్నారు.



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న భారత్ రాష్ట్ర ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్

# కార్మికుల సమస్యలు పరిష్కారానికి కృషి

**భారత్ రాష్ట్ర ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్**

జహీరాబాద్, డిసెంబర్ 15 : మహీంద్రా అండ్ మహీంద్రా ట్రాక్టరు ప్లాంట్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని భారత్ రాష్ట్ర ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ తెలిపారు. శుక్రవారం జహీరాబాద్‌లోని మహీంద్రా ట్రాక్టరు ప్లాంట్ వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. కార్మికుల సంక్షేమం కోసం తాము కృషి చేస్తున్నామన్నారు. కార్మికులకు మెరుగైన వేతనంతోపాటు సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. గతంలో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేస్తామన్నారు. కార్మిక సంఘం ఎన్నికల్లో బాణం గుర్తుకు ఓట్లు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి పి.సురేశ్, నాయకులు మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

# గవర్నర్ ప్రసంగం అభ్యంతరకరం

**అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్**



అందోల్, డిసెంబర్ 15: అసెంబ్లీలో గవర్నర్ తమిళిసై చేసిన ప్రసంగం అభ్యంతరకరంగా ఉన్నదని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. కాంగ్రెస్ కరపత్రాన్ని చదివినట్లు మాట్లాడి గవర్నర్ వ్యవస్థను అపహాస్యం చేశారన్నారు. రాష్ట్ర మొదటి పౌరురాలిగా ఉండి కేసీఆర్ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని బాధ్యతారహితంగా మాట్లాడడం సరికాదన్నారు. గవర్నర్ హోదాలో ఉండి కేసీఆర్ ప్రభుత్వ పనితీరును, కాంగ్రెస్ ప్రభుత్వం చేయాల్సిన పనులను సూచించాల్సింది పోయి అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ కార్యకర్తలాగా మాట్లాడడం సబబుకాదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం హయాంలో చేసిన పనులు, ప్రగతిని ప్రపంచంలోని పలు సంస్థలు ప్రశంసిస్తూ అవార్డులు ఇచ్చిన విషయాన్ని మరిచిపోయారా అని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వంలో హైదరాబాద్‌తోపాటు మారుమూల గ్రామాలు సైతం ఎంతో అభివృద్ధి చెందాయని మీరు కావాలంటే మా అందోల్ నియోజకవర్గానికి రండి అభివృద్ధి చూపిస్తామన్నారు. మేము ముందు నుంచి కాంగ్రెస్–బీజేపీ ఒకటేనని చెబుతున్నామని, ఇప్పుడు గవర్నర్ ప్రసంగంతో మరోసారి రుజువైందన్నారు.

# మత్తు పదార్థాలను సమూలంగా నిర్మూలించాలి

- సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత
- పెండింగ్ కేసులు, ఫంక్షనల్ వర్టికల్‌పై జరిగిన సమీక్ష




సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్వేత

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 15 : గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలను సమూలంగా నిర్మూలించాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత అన్నారు. శుక్రవారం పోలీస్ కమిషనరేట్‌లో జిల్లా పోలీస్ అధికారులతో పెండింగ్‌లో ఉన్న కేసులు, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి సీపీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇన్సిడెంట్ ఫ్రీ ఎన్నికలు నిర్వహించినందుకు పోలీస్ అధికారులను అభినందించారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు సమూలంగా నిర్మూలించాలని, విక్రయించే వారిపై నిఘా పెట్టి కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నమోదైన కేసులు త్వరగా పరిశోధన చేసి డిస్పోజల్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, పోక్సో, దొంగతనాల కేసులు త్వరగా ఛేదించాలన్నారు. ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్, పారదర్శకంగా ఉండాలన్నారు. సీసీటీఎన్‌ఎస్ ప్రాజెక్ట్ ద్వారా ప్రతి దరఖాస్తును, ఎఫ్ఐఆర్‌లను, సీడీఎఫ్, పార్ట్–1, పార్ట్–2, రిమాండ్ సీడీ, ఛార్జ్‌షీట్, కోర్టు డిస్పోజల్ ఆన్‌లైన్‌లో రోజూ ఎంటర్ చేయాలని ఆదేశించారు. రోజూ సీఐలు, ఏసీపీలు మానిటర్ చేయాలని సూచించారు. నేరాలు జరిగే ప్రదేశాలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రదేశాలు హాట్‌స్పాట్‌గా గుర్తించి పాయింట్ బుక్స్ ఏర్పాటు చేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. సమీక్ష సమావేశంలో అడిషనల్ డీసీపీ అందె శ్రీనివాసరావు, ఏసీపీలు సతీష్, రమేశ్, సురేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, శ్రీనివాస్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# మాతృభూమి రుణం తీర్చుకుంటాం

- తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు వంశీరెడ్డి
- దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ



గజ్వేల్‌లో దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ సభ్యులు

గజ్వేల్ అర్బన్, డిసెంబర్ 15 : పట్టణంలో తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం 15 మంది దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు వంశీరెడ్డి మాట్లాడుతూ అమెరికాలోని వివిధ రాష్ట్రాల్లో వ్యాపారాలు, ఉద్యోగాలు నిర్వహిస్తున్న తాము ఒకసంఘంగా ఏర్పడి మాతృభూమి రుణం తీర్చుకోవడానికి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సంఘ సభ్యుడు సురేశ్‌రెడ్డి సహకారంతో గజ్వేల్‌లో 15మంది దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఈ ప్రాంతానికి తమ సంఘం ద్వారా మరిన్ని సేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కవితారెడ్డి, స్థానిక ఫిజియోథెరపిస్ట్ గీతారెడ్డి, సుందర సత్సంగ్ అధ్యక్షుడు రామచంద్రం, సభ్యులు శివకుమార్, లక్ష్మయ్య పాల్గొన్నారు.